## వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..?







## సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలి



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## మద్యం దుకాణాలకు 69 దరఖాస్తులు

**అక్షరటుడే, ఇందూరు:** మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా బుధవారం వరకు 69 దరఖాస్తులు వచ్చాయి. నిజామాబాద్ స్టేషన్ పరిధిలో 25, బోధన్ పరిధిలో 12, ఆర్మూర్ స్టేషన్ పరిధిలో 16, భీమ్‌గల్ పరిధిలో తొమ్మిది, మోర్తాడ్ స్టేషన్ పరిధిలో 7 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు.

**కామారెడ్డిలో..**

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో 49 మద్యం షాపులకు ఇప్పటివరకు 57 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో మద్యం టెండర్ల దరఖాస్తుల విధానాన్ని పరిశీలించారు. కామారెడ్డి పరిధిలో 12, దోమకొండ పరిధిలో 6, ఎల్లారెడ్డి పరిధిలో 3, బాన్సువాడ పరిధిలో 15, బిచ్కుంద పరిధిలో 21 దరఖాస్తులు వచ్చాయన్నారు.





## శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో..

**అక్షరటుడే, మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద ఉధృతి కొద్దిమేర తగ్గింది. దీంతో బుధవారం ఉదయం 16 గేట్లు తెరిచి దిగువకు నీటిని వదిలిన అధికారులు మధ్యాహ్నానికి గేట్ల సంఖ్యను తగ్గించారు. ప్రాజెక్టు 8 గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 35,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 34,790 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 1090.90 అడుగులకు (80.053 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా నీటి విడుదలను అధికారులు కొనసాగిస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 709 క్యూసెక్కుల నీరు ఆవిరిగా పోతోంది.

## నిజాంసాగర్ ప్రాజెక్టులో..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 34,604 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్‌కు వరద వస్తుండడంతో వరద గేట్ల ద్వారా 32,820 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1404.9 అడుగుల (17.7 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. కాగా ఎగువన సింగూరు నుంచి ప్రవాహం తగ్గింది. దీంతో అధికారులు నీటి విడుదలను తగ్గించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్ట్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలోకి 2905 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రాజెక్ట్‌లోకి 27.4 టీఎంసీల నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం: సీపీ

**అక్షరటుడే, ఇందూరు:** ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. దసరా సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక లక్కీడ్రా బాక్స్‌లను బుధవారం ఆర్‌ఎం కార్యాలయంలో తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పండుగను పురస్కరించుకొని ప్రయాణికులకు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆర్‌ఎం జ్యోత్స్న మాట్లాడుతూ.. ప్రతి ప్రయాణికుడి సహకారమే సంస్థ విజయానికి మూలాధారం అన్నారు. అనంతరం విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం మధుసూదన్, పీవో పద్మజ, ఏవో పరమాత్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆనంద్ బాబు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా బస్సుల్లో ప్రయాణించిన వారి నగదు బహుమతులను అందజేశారు. మొదటి విజేతగా చంద్రయ్య (రూ.25 వేలు), రెండో విజేతగా షేక్ బాబర్ (రూ.15 వేలు), మూడో విజేతగా రాంప్రసాద్ (రూ.10 వేలు) నిలిచారు.



# ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

వానాకాలం వరికోతలు ప్రారంభం అయ్యాయి. దీంతో అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. రెండేళ్లుగా ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉంటుంది. ఈ ఏడాది కూడా కేంద్రాలకు భారీగా వడ్లు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ద్వారా 8.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

- అక్షరటుడే, ఇందల్వాయి

- జిల్లాలో 650కి పైగా కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- పలుచోట్ల ప్రారంభమైన కేంద్రాలు
- వర్షాలతో రైతుల ఆందోళన

వానాకాలం సీజన్‌లో జిల్లాలో 650కిపైగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. వానాకాలం సీజన్‌లో జిల్లాలో 4.38 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ముందస్తుగా సాగు చేసిన ప్రాంతాల్లో వరికోతలు ప్రారంభం అయ్యాయి. ఆగస్టులో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో పంట నష్టం జరిగింది.

అయినప్పటికీ ఎనిమిదిన్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో జిల్లాలో దాదాపు 80శాతం మంది రైతులు సన్నరకం వరి సాగు చేశారు. గతంలో సన్నాలను వ్యాపారులు, దళారులకు రైతులు విక్రయించేవారు. అయితే బోనస్‌పై ఆశతో ప్రస్తుతం కేంద్రాల్లోనే అమ్ముతున్నారు. దీంతో రికార్డు స్థాయిలో కేంద్రాలకు వడ్లు వస్తున్నాయి.

### బ్యాంకు గ్యారంటీ ఉంటేనే..

ధాన్యం కేటాయింపుల విషయంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు రైస్ మిల్లర్ల నుంచి ముందుగానే బ్యాంక్ గ్యారంటీ తీసుకోనున్నట్లు తెలిసింది. గతంలో అనేక మిల్లులు సీఎంఆర్ చెల్లించలేదు. దీ క్రమంలో ముందు జాగ్రత్తగా మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలను తీసుకుంటున్నారు. జిల్లాలో 303 రైస్ మిల్లులు ఉండగా ఇది వరకే 51 మిల్లులను డిఫాల్టర్‌గా గుర్తించారు. ఆ మిల్లులకు ధాన్యం కేటాయించకుండా మిగతా వాటికి మాత్రమే ఇవ్వనున్నారు. ఆయా మిల్లర్ల నుంచి ముందస్తుగా అండర్ టేకింగ్ బ్యాంక్ గ్యారంటీలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.

### పలుచోట్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలోని పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించారు. బోధన్, ఎడపల్లి మండలాలతో పాటు సిరికొండ మండలంలో ముషీర్ నగర్, కొండూరు,తాళ్లరామడుగు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా 17శాతంలోపు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,389, బీ గ్రేడ్ రకానికి రూ.2,369 మద్దతు ధర చెల్లిస్తోంది.

### ఆగం చేస్తున్న వానలు

పంటలు చేతికొచ్చే తరుణంలో వానలు రైతులను ఆగం చేస్తున్నాయి. మరో కొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు కోసిన పంటలు ఎండటం లేదు. మరోవైపు వర్షాలతో పంటలు కోయలేని పరిస్థితి నెలకొంది. వర్షాలతో కోతకొచ్చిన పంట చేతికి అందుతుందో లేదోనని దిగులు చెందుతున్నారు.

## మాధవనగర్ ఆర్వోబీని త్వరగా పూర్తి చేయాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మాధవనగర్ గేట్ వద్ద బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఆర్వోబీ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ.. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఆర్వోబీ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన రూ.10 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అడ్డు పడడం ఎంతవరకు సబబని దినేష్ కులాచారి ప్రశ్నించారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సలహాదారుడు షబ్బీర్ అలీ నిధులు మంజూరు చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మాధవనగర్ రైల్వే వంతెనతో పాటు అర్సపల్లి, అడవి మామిడిపల్లి వంతెనలను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నక్క రాజేశ్వర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.







## ట్రస్మా నూతన కార్యవర్గం

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) నిజామాబాద్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా సుందర్ (శ్రీ భాషిత పాఠశాల ఆర్మూర్), జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనుముల క్రాంతి (ఆర్కిడ్ పాఠశాల నిజామాబాద్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ రెడ్డి, పరిశీలకులుగా శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ.. త్వరలోనే మిగతా కార్యవర్గం ఎన్నుకుంటామన్నారు. ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## ఆధారాలు లేకుండా ఎక్కువ డబ్బు తరలించవద్దు

**అక్షరటుడే, ఇందూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సరైన ఆధారాల్లేకుండా రూ. 50వేల కంటే ఎక్కువ డబ్బును తరలించవద్దని సీపీ సాయి చైతన్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ మొత్తంలో నగదు తరలిస్తే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని, నవంబర్ 11న ప్రక్రియ పూర్తికానుందన్నారు. కమిషనరేట్ కేంద్రంలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఏసీపీలు వెంకటేశ్వర్లు, రాజా వెంకటరెడ్డి, శ్రీనివాస్, సీసీఆర్బీ సీఐ సతీష్, ఎలక్షన్ సెల్ సీఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ మార్చాలని వినతి

**అక్షరటుడే, గాంధారి:** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తమ గ్రామంలోని వార్డులకు కేటాయించిన రిజర్వేషన్‌ను మార్చాలని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని రెండో, మూడో వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేశారన్నారు. ఎస్టీలు లేని వార్డుకు ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు.

## నష్టం వివరాలు సేకరించిన కేంద్ర బృందం..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి నియోజకవర్గంలో కేంద్ర బృందం పర్యటన ముగిసింది. ఈ మేరకు బుధవారం ఉదయం 10:30 గంటలకు భిక్కనూరు మండల కేంద్రానికి చేరుకున్న బృందం మండల కేంద్రంలోని ధాన్నమ్మ కుంటను పరిశీలించింది. అక్కడి నుంచి అంతంపల్లి గ్రామంలో ధ్వంసమైన పంచాయతీ రాజ్ రోడ్డు, పంట నష్టాన్ని పరిశీలించారు. బీబీపేట బ్రిడ్జిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ వద్ద తెగిపోయిన బ్రిడ్జిని పరిశీలించి అక్కడినుంచి వైకుంఠధామం వెళ్లే దారిలో ఉన్న ఫిల్టర్ బెడ్ పంప్ హౌస్, తెగిపోయిన కాజ్‌వేను పరిశీలించి కలెక్టర్ ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అక్కడినుంచి లింగంపేట మండలానికి బయలుదేరారు. కేంద్ర బృందం వెంట కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.





## కాంగ్రెస్ నయవంచక పాలనను ఎండగట్టాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** కాంగ్రెస్ నయవంచక పాలనను ఎండగట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్‌లోని కేసీఆర్ కాలనీలో నిర్వహించిన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రజలకు బాకీ ఉన్న హామీలను 'కాంగ్రెస్ బాకీ కార్డు' రూపంలో ప్రజలందరికీ చేరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ నయవంచక పాలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమాన్ని తీసుకొచ్చామన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చి.. గెలిచిన తర్వాత ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కాలేదన్నారు.

## జిల్లాను స.హ.చట్టం అమలులో ఆదర్శంగా నిలపాలి

**అక్షరటుడే, ఇందూరు:** సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ శాఖల్లో పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. స.హ.చట్టం వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని బోధన్, ఆర్మూర్ డివిజన్ స్థాయిలో గురువారం తహశీల్దార్ల ఆధ్వర్యంలో అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి వివరాలతో బోర్డును విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అధికారులు మారిన సందర్భాల్లో వెంటనే ఆ సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. ఆర్టీఐ అమలుకు సంబంధించి తప్పనిసరిగా రిజిస్టర్‌ను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు వివరాలను పొందుపర్చాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఓసారి స.హ.చట్టం అమలుపై సమీక్ష జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, జడ్పీ సీఈవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**అక్షరటుడే, ఇందల్వాయి:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి షారోన్ షైని క్రిస్టినాతో మాట్లాడారు. హెపటైటిస్ బి కిట్లు, ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి ఇంటింటికీ తిరిగి మురికినీళ్లు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. జ్వరానికి సంబంధించి రక్త పరీక్షలు చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ల్యాబ్ టెక్నీషియన్ అనితా రాథోడ్, ఫార్మసిస్ట్ విజయలక్ష్మి, ఆనంద్, నర్సింగ్ ఆఫీసర్ ప్రకాశ్, గంగామణి పాల్గొన్నారు.



## ఆర్మూర్‌లో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పూజా నరేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అమలు కాని 420 హామీలను ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. రెండేళ్లయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందన్నారు. అర్హులందరికీ 24 నెలలుగా హామీల తాలుకు బాకీ కార్డులను ఈ సందర్భంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. అర్హులకు బాకీ పడ్డ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని.. లేకపోతే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడే నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్వసమాజ్ అధ్యక్షుడు సుంకరి రవి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఈగ గంగాధర్, వైస్ చైర్మన్ నర్మే నవీన్, యువజన అధ్యక్షుడు గుంజల పృథ్వీరాజ్, అగ్గు క్రాంతి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు జన్నపల్లి రంజిత్, సీనియర్ నాయకులు మీరా శ్రవణ్, ఇందూర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని ఏఐకేయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్. రాష్ట్ర కార్యదర్శి దేవారం డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని పంటలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రాష్ట్రంలో 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతుందన్నారు. మొక్కజొన్న కోతకు వచ్చి 25రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. రేవంత్ రెడ్డికి రైతులపై ఎంత చిత్తశుద్ధి ఏంటో అర్థం అవుతుందని విమర్శించారు. అకాల వర్షాలతో ఇప్పటికే రైతులు నష్టాల పాలవుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. సమావేశంలో ఏఐకేయూఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి కిషన్, డివిజన్ నాయకులు రాజన్న, ఆకుల గంగారాం, జక్కం శేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.




## సీజేఐపై దాడికి యత్నించడం హేయమైన చర్య

**అక్షరటుడే, ఇందూరు:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై దాడికి యత్నించడం హేయమైన చర్య అని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యున్నత హోదాలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దాడికి యత్నించడం అంటే రాజ్యాంగానికి మాయని మచ్చగా భావించవచ్చన్నారు. ఇలాంటి దాడులను దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పౌర సమాజం నిరసనల ద్వారా చైతన్యం చేయాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, పీఆర్వో దండు స్వామి, భరత్ రాజ్, రాజేష్, నహీదా బేగం, రంజిత, వినయ్ కుమార్, రామస్వామి, రాహుల్, రామకృష్ణ, బాలామణి, వెంకటేష్ గౌడ్, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట మండలంలో గత నెలలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షం కురిసింది. దీంతో లింగంపల్లి కుర్దు మల్లారం చెరువు కట్ట తెగిపోయింది. ఫలితంగా వరదనీటి ప్రవాహంతో కేకేవై రహదారిపై పాములాగు వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. దెబ్బతిన్న వంతెనను గత నెల 4న సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించి తాత్కాలిక వంతెన డైవర్షన్ రోడ్డుకు రూ.కోటి నిధులు మంజూరు చేశారు. అయితే, వరుస వర్షాల కారణంగా పనులు సాగడం లేదు. మరోవైపు వంతెన ప్రమాదకరంగా మారుతోంది.

- అక్షరటుడే, లింగంపేట



# వంతెన నిర్మాణం పూర్తయ్యేదెన్నడో..!

- భారీ వర్షాలతో కోతకు గురైన పాములాగు బ్రిడ్జి రోడ్డు
- సీఎం పరిశీలించి నిధులు మంజూరు చేసినా పూర్తికాని పనులు
- 45 రోజులుగా కామారెడ్డి, ఎల్లారెడ్డికి నిలిచిన బస్సులు
- పట్టించుకోని అధికారులు

తెగిపోయిన వంతెన వద్ద అధికారులు తాత్కాలికంగా మొరం పోసి చేతులు దులుపుతున్నారు. మరోవైపు వంతెన పూర్తిగా దెబ్బతినడంతో భారీ వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపేశారు. దీంతో ఎల్లారెడ్డికి బస్సులు నడవక పండుగలు, ఇతర అవసరాలకు వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వంతెన దెబ్బతిని 45 రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు డైవర్షన్ వంతెన పూర్తి కాలేదు దీంతో ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. లింగంపేట, ఎల్లారెడ్డి నుంచి నిత్యం కామారెడ్డిలో పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులు వెళ్తుంటారు. అలాగే లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పోల్కంపేట, షట్పల్లి సంగారెడ్డి గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ప్రస్తుతం బస్సులు లేక విద్యార్థులు ఇంటి వద్దనే ఉంటున్నారని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.

### ప్రత్యామ్నాయ చర్యలు కరువు..

పాములాగు వంతెన పూర్తిగా దెబ్బ తినడంతో రోజురోజుకు వంతెన కృంగిపోతోంది. పాములాగు వంతెన వరకు ఎల్లారెడ్డి బస్ సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పోల్కంపేట శెట్పల్లి సంగారెడ్డి మీదుగా లింగంపేటకు బస్ సర్వీస్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా.. అధికారులు ఆలోచించడం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

### ఎమ్మెల్యే స్పందించాలి..

పాములాగు వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఈనెల 5న పనులు పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందిస్తేనే రోడ్డు పనులు త్వరగా పూర్తి అవుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. వంతెన రోజురోజుకు కుంగిపోవడంతో ప్రమాదవశాత్తు కూలిపోతే ద్విచక్ర వాహనాలు సైతం నడవలేక ప్రజలు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

## సీఎంఆర్‌ఆఫ్ చెక్కు అందజేత



**అక్షరటుడే,ఆర్మూర్:** నందిపేటకు చెందిన పీరాజీ గంగాధర్ అనే వ్యక్తి అనారోగ్యంతో చికిత్స పొందాడు. అనంతరం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ. 60వేల చెక్కును బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంద మహిపాల్, దమ్మాయి శ్రీను, తిమ్మల పోశెట్టి, జమీల్, రఫీక్, బల్గం దశరత్, ఖాజావలి, కాంతం చిన్నయ్య, ఎర్రం పోశెట్టి, మగ్గిడి శ్రీను, అర్సపల్లి శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాజాత

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పోలీస్ కళాజాత నిర్వహించారు. కలెక్టర్, డీపీఆర్వో ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు కళాజాత బృందం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆటపాటల ద్వారా విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, ఓటు ఆవశ్యకత, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాకారులు రమేష్, విఠల్, రామచంద్రం, తిరుపతి, లక్ష్మీనారాయణ, పోశెట్టి, మహేందర్, దివ్య, నాగరాజు, సవిత, లత, నరేష్, శిల్ప, కాశీ పాల్గొన్నారు.



## ఢిల్లీలో ఫ్లోర్ లీడర్ల సమావేశానికి హాజరైన కేఆర్ సురేశ్‌రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** దేశ రాజధాని ఢిల్లీలో ఫ్లోర్ లీడర్ల సమావేశం నిర్వహించారు. ఉప రాష్ట్రపతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశ మందిరంలో వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమయ్యారు. ఆయనతో పాటు సమావేశంలో కమల్ హాసన్, శివ(డీఎంకే), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్పీ), తంబి దురై (ఏఐఏడీఎంకే) హాజరయ్యారు. రాబోయే పార్లమెంటరీ సమావేశాల గురించి చర్చలు జరిపారు.

## కల్లెడలో ఐమాస్ట్ లైట్లు ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం కల్లెడ గ్రామంలో ఎంపీ నిధులతో మహాలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు గంగోళ్ల ప్రళయ్ తేజ్ మాట్లాడుతూ.. గ్రామంలో హైమాస్ట్ లైట్లు అవసరముందని అడిగిన వెంటనే మంజూరు చేసిన ఎంపీ అర్వింద్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బూత్ అధ్యక్షుడు మచ్చర్ల అర్జీత్, బండారి మధు, ఐలి అరుణ్, మండల ఉపాధ్యక్షురాలు మోతె శ్రావణ్య, శక్తికేంద్ర ఇన్‌ఛార్జి మోతె అశోక్, గ్రామ ఇన్‌ఛార్జి బోడిగం నాగేష్, భాశెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** రేవంత్ సర్కారు రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతన శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఎంఎస్‌పీ ధర రూ.2,400 ఉండగా దళారులు క్వింటాలకు రూ.1,800 నుంచి రూ.2,000 కంటే మించి కొనుగోలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిట్టి భజన, పోశెట్టి, మల్లయ్య, శ్రీనివాస్, సంతు, కలిగోట ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

**అక్షరటుడే, ఇందూరు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం వివిధ స్థానాల్లో పోటీ చేస్తుందని రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసే సీపీఎం అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టే పద్ధతుల్లో బీజేపీ వైఖరి ఉందని, కావున ఆ పార్టీని ఓడించడానికి ప్రజలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకట రాములు, వెంకటేష్, నన్నే సాబ్, సుజాత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## బీడీఎస్ఎఫ్ కన్వీనర్‌గా సంజయ్



**అక్షరటుడే, ఇందూరు:** బహుజన డెమొక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా తలారి సంజయ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సాయి కృష్ణ తెలిపారు. బోధన్‌కు చెందిన సంజయ్ వామపక్ష విద్యార్థి ఉద్యమాల ద్వారా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. బీడీఎస్ఎఫ్ బలోపేతానికి, విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



## షెట్కార్ మల్లికార్జున్ అప్పా సేవలు మరువలేం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్‌పార్టీకి షెట్కార్ మల్లికార్జున్ అప్పా చేసిన సేవలు మరువలేమని ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బిచ్కుంద మండలంలోని షెట్కార్ మల్లికార్జున్ ఇంటికి ఎమ్మెల్యేలు బుధవారం వెళ్లారు. కుటుంసభ్యులను పరామర్శించి.. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న మల్లికార్జున్ అప్పా సతీమణిని పరామర్శించి ధైర్యం చెప్పారు.



## సొంత గూటికి మాజీ సర్పంచ్ మదన్ రావు

**అక్షరటుడే,పెద్ద కొడప్‌గల్ :** మండలంలోని పోచారం తండా మాజీ సర్పంచ్ మదన్ రావు తన అనుచరులతో కలిసి సొంత గూటికి చేరారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పిట్లం మండలకేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో జుక్కల్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హాజరు కాగా, ఆయన సమక్షంలో మాజీ సర్పంచ్‌తోపాటు ఆయన అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం షిండే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లోకి మదన్ రావు తన అనుచరులతో తిరిగిరావడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ తరపున ఆయనకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



## భాగ్‌చంద్ మహారాజ్‌కు ఘనంగా స్వాగతం

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలో గురుసాహెబ్ 8వ గురువు భాగ్‌చంద్ మహారాజ్‌కు లబానాకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ మహారాష్ట్రలోని చంద్రపూర్ తండావాసి బాగ్‌చంద్ మహారాజ్ పీఠం స్వీకరించి మొదటిసారిగా తమ తండాకు వస్తున్న సందర్భంగా ఆయనకు భారీ సంఖ్యలో భక్తులమంతా స్వాగతం పలికామన్నారు. మండల కేంద్రం నుండి జాతీయ రహదారి మీదుగా పెద్ద దేవిసింగ్ తండావరకు బైక్ ర్యాలీ తీశారు. తండాలో గురువారం హోమం, అన్నదానం నిర్వహించారు.